
# తప్పెవరిది?

సి.వి. సర్వేశ్వరశర్మ




సినిమా థియేటరు ముందున్న జోళ్ళషాపు అరుగుమీద చెప్పులు కుడు తున్న చంద్రయ్యను చూసి షాక్ తిన్నాను. గబ గబా అడుగు లేసుకుంటూ చంద్రయ్య దగ్గరకు వెళ్లాను.

'మళ్ళీ: నువ్వు చెప్పులు కుడుతున్నావా? రత్తికి పెళ్ళి చేయలేదా?,' ఆశ్చర్యంగా అడిగాను.

నన్ను చూడగానే చంద్రయ్య లేచినుంచుని దండం పెట్టాడు. 'మా బతుకులింతే బాబుగారు' అన్నాడు.

నాకు అర్థం కాలేదు 'అసలేం జరిగింది. మీ వాడు ఏం చేస్తున్నాడు?' ప్రశ్నించాను.

'ఏం చెప్పమంటారు బాబు. గుడిసెమీద దెబ్బతీసి వెళ్ళిపోయాడు. నేను అప్పులు పాలయ్యాను. ఆడు దొర బ్రతుకుల్లోకి వెళ్ళిపోయాడు.' చంద్రయ్య నిరుత్సాహంగా మాట్లాడుతున్నాడు.

రత్తి చాయ్ తెచ్చింది. చంద్రయ్యకు ఇవ్వబోయింది. ఆగమని చంద్రయ్య వారించాడు. నాకయితే మనసులో ఏదో మూగ బాధ వేధిస్తోంది. జోళ్ళ షాపులోకి వెళ్ళి కూర్చున్నాను.

'సార్: లేటెస్టు చెప్పల్సు వచ్చాయి. చూస్తారా?' షాపు లోని సేల్సు మేన్ అడిగాడు.

'వద్దు' చెప్పాను. సేల్సుమాన్ రాంమూర్తి నాకు చాలా సంవత్సరాలుగా తెలుసు. 'రాంమూర్తి' ఇలారా!' పిలిచాను. వచ్చాడు 'చంద్రయ్య సంగతి ఏమిటి?' అడిగాను.

యాభయి ఏళ్ళ రాంమూర్తి వయసుకు సరిపడా అనుభవం ఉంది. నవ్వాడు 'ఎవరి రాతను ఎవరు తప్పించగలరు సార్' అన్నాడు.

నాకు చెళ్లుమని కొట్టినట్లయింది. షాపులో పెద్దగా జనంలేరు. ఒకరిద్దరు కష్టమర్స్ ఉన్నారు. రాంమూర్తి వారి దగ్గరకు వెళ్ళాడు. నాకు గతం కళ్లముందుకు రాసాగింది.

* * *

పదమూడేళ్ళ క్రితం అమలాపురం ఇంకా ఇప్పుడున్నంత ముస్తాబు కాలేదు. అప్పుడప్పుడే పాతరూపం తొలగించుకుంటూ కొత్తరూపం పోసుకునే ప్రయత్నంలో ఉంది.

పోలీసు స్టేషన్ ఎదుట ఒక చిన్న పెంకుటిల్లుండేది. చాలా పాతది. అయినా వ్యాపారానికి సెంటర్ కావడం వల్ల దానిని వీలున్న వరకు బాగా తీర్చిదిద్ది అందుల్లో ఒక పుస్తకాల షాపు, పురుగుమందుల విక్రయం షాపు, చెప్పుల దుకాణం ఉండేవి.

సైకిలు మీద వెడుతున్న నాకు చెప్పుల దుకాణం ముందు కూర్చున్న చంద్రయ్య కనిపించాడు. తెగిన చెప్పు కుట్టించుకోవడానికి ఆగాను.

చెప్పు కుట్టమని చంద్రయ్యకి ఇచ్చాను. చంద్రయ్య టీ తాగడానికి లేచాడు. 'కొంచెం అర్జంటు ముందు చెప్పు కుట్టియ్యి' అడిగాను.

చంద్రయ్య కళ్ళల్లో తళుక్కుమని ఏదో సంతోషం కన్పించింది. 'ఒరేయ్ వెంకి, బాబు గారి చెప్పుకుట్టివ్వరా!' చంద్రయ్య అన్నాడు.

వెంకికి పదమూడేళ్లుంటాయి. స్కూలు పుస్తకాలు పక్కన పెట్టి గబగబా చెప్పుకుట్టి ఇచ్చాడు. వెంకిని చూడగానే నా మనసులో ఎంతో బాధ అన్పించింది. చదువుకుంటూ ఆడుతూ పాడుతూ గడపాల్సిన సమయంలో చెప్పులు కుట్టి గబ్బులు సంపాదించడం మంచిది కాదు.

ఒకసారి డబ్బులు రుచిమరిగితే ఇక మనిషి దాని వెనకాలే పరిగెత్తుతాడు. బాల కార్మికులను నిర్మూలించలేక పోవడానికి ఇదొక కారణం. బాల్య స్థితిలో కన్పించే డబ్బులు వారి భవిష్యత్‌కు దెబ్బతీస్తున్న విషగుళికలని ఆ చిన్నారులకు తెలియదు. పొట్టనింపేందుకు తోడవుతోందనుకునే ఆ తల్లిదండ్రులకు తమ బిడ్డల భవిష్యత్‌కు తామే అడ్డుగోడవుతున్నారనే ఆలోచన రాదు.

వెంకిని గట్టిగా మందలించాను, ఆగాను. చంద్రయ్య వచ్చాడు. కుర్రాడు తెలివైనవాడు, చురుగ్గా ఉన్నాడు. వాడిని చదువుకోనియ్యి. నీ తరువాత నీ కొడుక్కి ఈ అరుగు అప్పగించి చెప్పులు కుట్టేవానిగా తయారు చేయకు. ఎంతో చెప్పాను.

అమాయకుడిని చూసినట్లు చూశాడు నన్ను. అంతా విని ఊ కొట్టాడు చంద్రయ్య. వెంకి మనసులో ఏవేవో ఆలోచనలు మొదలయ్యాయి. ఇలా మొదలయిన నా తాపత్రయం మా మధ్య రోజురోజుకి అనుబంధాన్ని పెంచసాగింది.

సలహాలకు, సంప్రదింపులకు చంద్రయ్య మా ఇంటికి వస్తూ ఉండేవాడు. కూతుర్ని కూడా తీసుకు వచ్చేవాడు. కూతురు రత్తి సన్నగా పీలగా ఉంటుంది. పోషణ బాగుంటే బాగా అందంగా తయారవుతుంది ఎలా? ఎవరిస్తారు డబ్బు?

పేదలకు తెలివీ ఆలోచన ఉంటాయి. కాని వాటిని అమలులో పెట్టేందుకు కావలసిన ఆర్థిక శక్తి ఉండదు. అందుకే ధనవంతులకు బానిసల్లా బతుకుతూ ఉంటారు.

## సెక్సీగర్ల్

ఊర్మిళకు సెక్సీడాన్స్‌లు కొత్తకాదు. 'రంగీలా' చిత్రం చూసిన వారికి ఈ విషయం గుర్తుండే ఉంటుంది. ఒకవైపు నమ్ముకున్న రామూ తన సినిమాల్లో అంత్రాకు ఛాన్స్‌లు ఇస్తుంటే, మరోవైపు అవకాశాల కోసం ఎదురుచూసీ, చూసీ ఊర్మిళ పాపం విసిగి పోయింది. దీనితో 'దీవానగీ' చిత్రంలో బిపాసాను మించిపోయి మరీ వీరలెవెల్లో ఎక్స్‌పోజింగ్ చేసిందట. ఇక ఊర్మిళ కూడా ఇషాగోపికర్‌లాగా సెక్సీడాన్స్‌లకు పరిమితం అయ్యే ఆలోచనలో ఉన్నట్లుంది.



నాకు అస్తమానం ఒక జోక్ జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఒక ధనవంతుడు నౌకర్ని అడిగాడుట. 'ఒరేయ్ భగవంతుడు ప్రత్యక్షమై నీకు ఏం కావాలని అడిగితే ఏం కోరుకుంటావ్?'

'బోలెడంత డబ్బు, కార్లు, పొలాలు కోరుకుంటాను' అన్నాడుట నౌకరు. దానికి ధనవంతుడు చిరాకు పడి 'ఓరి! వెర్రి వెధవా! అవన్నీ ఎందుకురా? నేనైతే ఏమి, కోరుకుంటానో తెలుసా?' అని అడిగాడుట.

"తెలీదు' తల అడ్డంగా తిప్పాడుట నౌకరు. 'నాకు బోలెడంత తెలివి ప్రసాదించు స్వామి అని అడుగుతాను' అన్నాడుట ధనవంతుడు.

దానికి నౌకరు 'అవును అయ్యగారు ఎవరికీ లేనిది వారు కోరుకుంటారు' అన్నాడుట.

కాలం దొర్లుతోంది. వెంకి అసలు పేరు వెంకన్న. వాడు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి తరగతిలో పాసయ్యాడు. చంద్రయ్య మా యింటికి వచ్చినా కాళ్ల మీద పడిపోయాడు.

నాకు తెలిసిన టీచర్నును ఒప్పించి వెంకన్నకు ప్రయివేట్లు ఏర్పాటు చేశాను. నాకు కూడా భలే సంతోషం అన్పించింది. చంద్రయ్య ససేమిరా ఒప్పుకోనన్నా వెంకన్నను అమలాపురం కాలేజిలో జేర్పించాను.

చంద్రయ్య చేతులు ఎత్తేశాడు. నాకు తెలిసిన వారందర్నీ చంద్రయ్యకు పరిచయం చేశాను. స్వచ్ఛంద సేవా సంస్థలు తమవంతు సహాయాన్ని అందించాయి. చంద్రయ్య నిద్రపోయాడో లేదో తెలియదు కాని వెంకన్నకు ఇంటర్ చదువు చెప్పించాడు.

రత్తి కూడా పెద్దదయింది. వోణి వేసుకుని చంద్రయ్యతో మాయింటికి వచ్చింది. 'బాబుగారు: ఇక మా వాడికి నేను చదువు చెప్పించలేను. దీనికి పెళ్ళి చేయాలి' చెప్పాడు.

'మన చేతుల్లో ఏముంది. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. రత్తిని ఎవడో ముందుకు వచ్చి పెళ్ళి చేసుకోవచ్చు. అంది వస్తున్న అదృష్టాన్ని కాలదన్నకు' నేను చెప్పాను.

విచిత్రమైన సంఘటన ఏమిటంటే వెంకన్నకు ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. నాకైతే కొండెక్కినంత సంబరం అన్పించింది. చంద్రయ్య ఎట్టి పరిస్థితులలోను వెంకన్నకు చదువు చెప్పించలేనని చెప్పేశాడు.

వారం రోజులు చంద్రయ్యకు క్లాసులు తీసుకుని డబ్బుకు ఏర్పాటు చేసే పద్ధతులు చెప్పాను. స్కాలర్‌షిప్ గురించి నేను చూస్తానని చెప్పాను.

'కుండలు ఇంట్లో డింకీ కొడుతున్నాయని' చంద్రయ్య బాధపడని రోజు లేదు. తండ్రి డబ్బు కోసం ప్రయత్నించేటప్పుడు తండ్రి చోట్లో రత్తి కూర్చుని డబ్బులు సంపాదించేది.

వెంకన్నలో అనేక మార్పులు మొదలయ్యాయి. తన దురదృష్టం వల్ల పేద కుటుంబంలో పుట్టినట్లు భావించేవాడు. తల్లి, తండ్రి, చెల్లి వీరంతా తాను తిరిగే సమాజంతో పోలిస్తే పనికి మాలిన వాళ్ళుగా అతనికి కన్పించేవారు.

నాలుగేళ్ళు చివరకు వచ్చేశాయి. ఇంజనీరింగ్ పరీక్షలు అయిపోయాయి. అప్పులు ఊబిలో చంద్రయ్య బాగా కూరుకుపోయాడు. వయసు బింకంలో రత్తి అందంగా కన్పిస్తున్నా బట్టలచాటున ఉన్న పుష్టిలేని ఆమె శరీరం వారి

దారిద్ర్య జీవితాన్ని ఎత్తి చూపుతోంది.

కొడుకు ఇంజనీరుగా ఎదిగాడు. చంద్రయ్యకు సొంతంగా ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం చేతనయ్యింది. మా ఇంటికి రావడం మానేశాడు. ఒకసారి రోడ్డున ఎదురైతే హడావడిగా వెడుతూ కన్పించాడు.

నాకు ఒక తృప్తి మిగిలింది. చెప్పులు కుట్టుకునే చంద్రయ్య కొడుకును ఇంజనీర్ చేయగలిగాను. అంటే నా ప్రయత్నం ఫలించిందని ఆత్మ సంతృప్తి.

* * *

'సార్' పలకరించాడు రాంమూర్తి,

ఈ లోకంలోకి వచ్చాను. 'చంద్రయ్య...' ఆగిపోయాను.

నాకుర్చీ ఎదురుగా బూటు కొలతలు కొలిచే కాళ్ళకు ఏ నెంబరు బూటు కావాలో తెలియజెప్పే దానిమీద రాంమూర్తి కూర్చున్నాడు. షాపులో ఎవరూ లేరు.

'చంద్రయ్య... చేజేతులా తన కొడుకును దూరం చేసుకున్నాడు సార్' అన్నాడు. ఆ మాటలు నేను నమ్మలేకపోయాను.

'జంషెడ్‌పూర్ ఏదో కంపెనీకి వెంకన్న ఇంటర్వ్యూకి వెళ్ళాడు. ఆ ప్రయాణానికి చంద్రయ్య చాలా అప్పులు చేశాడు. నా మటుకు నేను రెండువందలు ఇచ్చాను.' రాంమూర్తి చెప్పాడు.

'ఏమైంది ఇంటర్వ్యూ?' అడిగాను.

'ఉద్యోగం రాలేదు గాని వెంకన్నతో 'కోటి' అనే ఆసామి ఒకడు వచ్చాడుసార్.'

'కోటి ఎవరు?' ఆశ్చర్యంగా అన్పించింది.

'అక్కడే కథ అడ్డం తిరిగింది సార్. 'కోటి' జంషెడ్‌పోర్‌లో మేస్త్రీగా పనిచేస్తున్నాడుట సార్. వెంకన్న 'కోటి' కంటికి నచ్చాడు. పైగా రెండుమూడు మాటల్లో తమ కుటుంబాల మధ్య సంబంధాలు వున్నాయని కోటి వెంకన్నకు చెప్పాడట.'

నాకు కథ కొంచెం అర్థమవ్వసాగింది.

'వెంకన్నకు కోటి వలవేశాడా?' అనుమానంతో అడిగాను.

'అంతేకావచ్చు సార్. కోటికి ఒక్కతే కూతురు. అంతంత మాత్రం చదువుకుంది. వెంకన్నను అడిగాడట. కోటి కూతురు 'రూప' తనకు నచ్చిందని చెప్పాడట.'

'వయసులో వున్న కుర్రాడికి ఏ ఆడపిల్లయినా నచ్చుతుంది. ఆ వయసు అటువంటిది. మరి చంద్రయ్య ఏం చేశాడు?'

'పిల్లల ప్రేమకు తను అడ్డు వెళ్ళనన్నాడు'.

'సినిమా థియేటర్‌కు సమీపంలో సంవత్సరాల తరబడి కూర్చున్నందుకు సినిమా నీతి బాగానే నేర్చుకున్నాడన్నమాట' అన్నాను.

'కోటి యాభయివేల రూపాయలు కట్నం ఇస్తానన్నాడు' రాంమూర్తి చెబుతున్నాడు.

'సిరి వస్తూంటే మోకాలుతో అడ్డుకోకూడదు' చంద్రయ్య నిర్ణయం తీసుకున్నాడు.

చంద్రయ్య గూడెంలోని వారంతా పండగ చేసుకున్నారు. స్నేహితులందరికి పీకల దాకా సారా పోయించాడు. రెండు మహారాజా కుర్చీలు తెప్పించాడు. గూడెం బాణసంచా సామానుల పేలుడుతో దద్దరిల్లిపోయింది.

దగ్గరలోని అగ్రహారంలోని జమీందారు గారింట్లోనూ పెళ్ళయ్యింది. చంద్రయ్య ఇంట్లోను పెళ్ళయింది. గూడెం అంతా చంద్రయ్యను మెచ్చుకున్నారు.

పెళ్ళి అయిపోయింది. 'కోటి చెప్పాడుట సార్.'

'ఏమని'

'నీ తండ్రి వరస చూశావు కదా! యాభయి వేలు క్షణంలో ఆర్పేశాడు. నీ జీవితాన్ని ఇలాగే ఆర్పేస్తాడు. ఎవరి కర్మ వారిది. నువ్వు డబ్బుతో సుఖ పడాలంటే నాతో జంషడ్ పూర్ వచ్చెయ్యి. ఏదో ఒక ఉద్యోగం వస్తుంది. ఇక్కడే ఉన్నావంటే నీ చేత మీ నాన్న చెప్పులు కుట్టిస్తాడు.

ఉన్నట్టుండి వెంకన్న రూపతో జంషెడ్‌పూర్ వెళ్ళిపోయాడు. ఇప్పుడు వాడిపేరు వెంకన్న కాదు. జంషెడ్‌పూర్‌లో వాడిపేరు 'కన్నా'

తనని మరచి పొమ్మని తండ్రికి ఉత్తరం రాశాడు.

నాకు చాలా మానసిక అశాంతి మొదలయింది. చంద్రయ్య ముసలితనానికి వస్తున్నాడు. ఇంతకముందు కల్లోగంజి తాగి హాయిగా గడిపేవారు. నావల్ల కొడుకు చదువుకున్నాడు. అంటే తండ్రి నుండి కొడుకు విడిపోవడానికి పరోక్షంగా నేను కారకుడినా?

అంతంత మాత్రం ఆలోచనలతో ఒళ్ళు తెలియకుండా డబ్బు ఖర్చు పెట్టి కొడుక్కి దూరం అయిపోయిన చంద్రయ్యది తప్పా?

చంద్రయ్యకు అవగాహన తక్కువగా ఉంటుంది. అటువంటప్పుడు చంద్రయ్య నన్ను విడిచినా అతనిని పట్టుకుని సరియైన మార్గంలో నడిపించకపోవడం నాది తప్పా?

కొడుకు . తండ్రితో కూర్చుని సహాయపడడానికి బదులు పెళ్ళి పేరుతో దూరమై అందరి ఆకలి చూపులకు బలైపోతున్న వయసులో ఉన్న రత్తి సిగ్గును దాచలేని చాలీచాలని బట్టలతో చెప్పులు కుట్టడానికి బాధ్యులు ఎవరు?

జవాబు దొరకని ఈ ప్రశ్నలకు కాలమే సమాధానాలు చెప్పవచ్చు. ఎవరి తలరాత ఎవరు మార్చగలరు. ఇదంతా మన ఊహ కందని ఒక వింత అన్పించింది నాకు.

❀

